సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 24 । జనవరి । 2025



ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు.


II లో



జోరుగా గొలుసుకొట్టు చోరీలు

జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు.

డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.15 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పరిశోధన స్థానం శాస్త్రవేత్తలకు జాతీయ స్థాయి అవార్డు

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు జీవ నియంత్రణ చర్యలపై జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు గురువారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ఐసీఏఆర్, ఎన్‌బీఏఐఆర్ సొసైటీ ఫర్ బయో కంట్రోల్ అడ్వాన్స్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ చందీష్ ఆర్ బల్లాల్ టీమ్‌కు అవార్డు ఫర్ అవుట్ స్టాండింగ్ ఎక్స్‌టెన్షన్ వర్క్ ఇన్ బయాజికల్ కంట్రోల్ టీమ్ లభించిందన్నారు. వచ్చే నెల 25 నుంచి 27 వరకు జరగనున్న కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. కేంద్ర అధిపతి చలపతిరావుతో పాటు తెగుళ్ల విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నీరజ, డాక్టర్ వి.గోవర్ధనరావు, ఉద్యాన విభాగ శాస్త్రవేత్త ఎ.కిరీటీ, కీటక విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, డాక్టర్ పి.సునీత అవార్డును అందుకుంటారన్నారు. కొబ్బరి, కోకోలో జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై జరిగిన పరిశోధనలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో కొబ్బరిలో అధిక దిగుబడులు

సీపీసీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త రవిభట్



గంగలకుర్రులో కోకో తోటలను పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవిభట్

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలను సారవంతం చేసుకుంటే అంతర పంటల సాగుతో పాటు కొబ్బరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని అఖిల భారత వన్య తోటల సమన్వయ పథకం సీపీసీఆర్ఐ కాసర్‌గాడ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవిభట్ సూచించారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు అధ్యక్షతన కొబ్బరి, అంతర పంటల సాగులో ప్రకృతి వ్యవసాయం అనే అంశంపై రైతు సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిభట్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఉన్న వ్యర్థాలను భూమిలో కుళ్లింప చేసి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. ఇందుకు జీవామృతం ఎంతగానో పనిచేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కొబ్బరిలో పుప్పొడి, పిందెలు, మొవ్వ ఎదుగుదల తదితర అంశాలపై రవిభట్ వివరించారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న జీవ నియంత్రణ పరిశోధనలు, ప్రయోగశాలలను, ఉత్పత్తి చేస్తున్న బదనికలను పరిశీలించారు. పెథాలజీ విభాగంలో జరిగే పరిశోధనలు, శిలీంధ్ర నాశినిలను పరిశీలించారు. అంతకుముందు రవిభట్ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గంగలకుర్రుకు చెందిన చిటావజుల బాబురావు పొలంలో కొబ్బరి, కోకో, అరటి తదితర పంటలను పరిశీలించారు. పెథాలజీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, డాక్టర్ బి.నీరజ, డాక్టర్ ఎ.కిరీటి పాల్గొన్నారు.

డామినేటెడ్ ఆశలు గల్లంతు!

- నామినేటెడ్ పదవుల్లో టీడీపీ సీనియర్లకు మొండిచేయి
- జిల్లాలో చిన్నబుచ్చుకుంటున్న 'పెద్ద తమ్ముళ్లు'
- వేచి చూడమంటున్న బాబు.. పక్కన పెట్టిన లోకేశ్
- ఆర్ఎస్, ఆకుల, నామన, నాథ్‌బాబు, రమణబాబులకు దక్కని అవకాశం
- మిగిలిన వారికి సైతం లభించని భరోసా

సాక్షి, అమలాపురం: 'మేము సీనియర్లు' అని చెప్పుకునేందుకు తప్ప పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందని తెలుగు తమ్ముళ్లు తెగ ఇదైపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్తున్న నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం దక్కకపోవడంపై వారు లోలోనే మధనపడుతున్నారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడుని కలిస్తే 'చేద్దాం.. చూద్దాం' అంటుండగా.. లోకేశ్ అయితే తన కోటరీతో సఖ్యతగా లేనివారిని దాదాపుగా పక్కన బెట్టేశారు. కూటమి ఏర్పడిన తరువాత నామినేటెడ్ పదవులకు జిల్లాలో ఆశావహుల జాబితా అంచనాలకు మించి పెరిగింది. సీనియర్లు ఇదే తమకు ఆఖరి అవకాశం అన్నట్టుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో వివిధ కారణాలతో సీట్లు దక్కని తమ్ముళ్లతోపాటు పలువురు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. కాని చాలామందికి పదవుల కేటాయింపులో టీడీపీ అధిష్టానం మొండిచేయి చూపించింది. జిల్లాకు చెందిన ఫలానా నాయకుడు ఫలానా పదవి రేసులో ఉన్నారనే ప్రచారం పెద్దగా జరగడం లేదంటే టీడీపీలో సీనియర్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

'రేసు'లో ఉన్నా ఆర్ఎస్ 'ఊసే' లేదు

సీనియర్లలో కొత్తపేటకు చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యం గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. రామచంద్రపురం ఇన్‌చార్జిగా పని చేయించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు కొత్తగా పార్టీలో చేరిన వాసంశెట్టి సుభాష్‌కు చివరి నిమిషంలో అవకాశమిచ్చారు. అలిగిన ఆర్ఎస్‌కు నామినేటెడ్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. జిల్లా నుంచి నామినేటెడ్ రేసులో తానే ముందున్నానని ఆర్ఎస్ అంటున్నా పై స్థాయిలో ఆయన ఊసే ఎత్తడంలేదని క్యాడర్ చెబుతోంది. ఆర్ఎస్ భార్య రెడ్డి అనంతకుమారి టీడీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. కనీసం ఆమెకు అయినా అవకాశం వస్తుందని భావించినా ఫలితం లేదు. ఇదే నియోజకవర్గంలో కాపు ఉద్యమనేత ఆకుల రామకృష్ణ సైతం కార్పొరేషన్ రేసులో ఉన్నారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభాన్ని కాదని టీడీపీలో చేరినా ఫలితం లేకుండా పోయిందని రామకృష్ణ ఆవేదనతో ఉన్నారు. మరో నాయకుడు కె.వి.సత్యానారాయణరెడ్డి కూడా కార్పొరేషన్ పదవి ఆశిస్తున్నారు. గతంలో డీసీఎంఎస్ చైర్మన్ చేసిన ఆయన ఈసారి రాష్ట్ర స్థాయి పదవి కావాలంటున్నారు.

ఆప్కాబ్ లేదు.. డీసీసీబీ అయినా ఇస్తారా?

అమలాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆప్కాబ్ చైర్మన్ పదవిపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవి చినబాబు కోటాలో సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఇప్పటికే ప్రకటించారు. టీడీపీలో లోకేశ్ కోటరీకి పదవులు దక్కుతున్న తీరు చూస్తుంటే రమణ బాబుకు డీసీసీబీ అయినా ఇస్తారా? లేదా? అనే అనుమానం అతని అనుచరులలో కలుగుతోంది. ఇదే పదవికి మెట్ట ప్రాంతం నుంచి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తనయుడు, జెడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ రంగంలో ఉండడంతో సొంత పార్టీలోనే రమణబాబుకు పోటీ ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి వస్తుందని ఆశించారు. కాని గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ పదవితో సరిపెట్టారు. ''రమణబాబు కోటాలో అమలాపురం టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు సీటు కేటాయించాం కదా బాగా పనిచేసుకోండి'' అని అమలాపురం టీడీపీ నేతలతో చంద్రబాబు, లోకేశ్ వ్యాఖ్యానించినట్టు తెలిసి అతని అనుచరులు ఆందోళనలో ఉన్నారు. అల్లాడ స్వామినాయుడుకి అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పదవి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే, ఇతర పార్టీ పెద్దల ప్రమేయం లేకుండా లోకేశ్ వద్ద ల్యాబీయింగ్‌తో ఈ పదవి తెచ్చుకున్నారు. ఇది కూడా రమణ బాబు పదవికి అడ్డంకిగా మారే అవకాశముంది. అమలాపురం నుంచే మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ కూడా పెద్ద పదవి ఆశిస్తున్నా అతనికి రమణ బాబు, ఆనందరావుల నుంచి మద్దతు లేకపోవడం ప్రధాన అవరోధంగా మారింది. రాజోలు నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన రుద్రరాజు పద్మరాజు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ సభ్యునిగా ఉన్నారు. ఈయనకు ఈసారి ఇంకా నామినేటెడ్ దక్కలేదు. టీడీపీ సీనియర్ నాయకుడు రుద్రరాజు వెంకట రామరాజుకు సైతం పదవి దక్కలేదు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉంది. రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, అక్కల రిష్యంత్‌రాయ్ రాష్ట్ర స్థాయి పదవులు ఆశిస్తున్నారు.

నామనకు సొంత పార్టీలోనే అడ్డంకులు

గతంలో జెడ్పీ చైర్మన్‌గా, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన నామన రాంబాబు నామినేటెడ్ పదవికి సొంత పార్టీలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. తన పదవికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అడ్డు తగులుతున్నారని రాంబాబు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన డొక్కా నాథ్‌బాబు గతంలో టీటీడీ బోర్డు సభ్యునిగా ఉన్నారు. ఆయన కూడా రేసులో ఉన్నా పార్టీలో కనీసం చర్చ కూడా లేదు.



రెడ్డి సుబ్రహ్మణ్యం



ఆకుల రామకృష్ణ





నామన రాంబాబు



మెట్ల రమణబాబు



రుద్రరాజు పద్మరాజు

సాగు రుణ ప్రణాళికలో 66.71 శాతం లక్ష్యసాధన

– కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఈ ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి మూడు కేటగిరీలలో రైతు రుణ లక్ష్యం రూ.9,903 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ 6,607.22 కోట్లు అందించి 66.71 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన మూడో త్రైమాసానికి సంబంధించి జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రంగానికి 1,749 మంది పారిశ్రామికవేత్తలకు రూ.1,571.09 కోట్లు అందించినట్టు తెలిపారు. మొత్తం ప్రాధాన్య రంగాలకు 14,259 మందికి రూ.10.265 కోట్లు, అందించామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 695 యూనిట్లకు సబ్సిడీగా రూ.1,101 కోట్లు, బ్యాంకు రుణంగా రూ.1,191 కోట్లకు ఆమోదం తెలిపారన్నారు. బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 1,275 యూనిట్ల మంజూరుకు రూ.24.52 కోట్లతో ఆమోదం తెలిపారు. అదేవిధంగా కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి 879 యూనిట్లకు రూ.27 కోట్ల రుణాల మంజూరుకు ఆమోదం తెలిపారు. జనరిక్ ఫార్మాస్యూటికల్ పథకాలకు 53 యూనిట్లకు రూ రూ.4.24 కోట్లు, గ్రూపు పథకాలకు కాపు కార్పొరేషన్ కింద యూనిట్లకు రూ.2 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపారు. తొలుత జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పి.కేశవవర్మ, డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. ఆర్బీఐ మేనేజర్ నవీన్, లీడ్ బ్యాంక్ కన్వీనర్ సాయి మనోహర్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ స్వామినాయుడు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, సిడ్బీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

4న గోవింద మాల దీక్ష ప్రారంభం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో గోవిందమాల దీక్షాధారణ(శ్రీనివాస శరణాగత దీక్ష)కు దేవస్థానం తరఫున ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వచ్చే నెల 4న దీక్ష ప్రారంభం కాగా, 26న ముగుస్తుందన్నారు. 24 రోజుల పాటు అర్ధ మండల దీక్షగా స్వామివారి సన్నిధిలో గోవిందమాల దీక్షాధారణ జరుగుతుందని చెప్పారు. ఈ దీక్ష చేపట్టే భక్తులకు దీక్షా వస్త్రాలు, మాలలు, భోజనాన్ని దేవస్థానం ఉచితంగా ఏర్పాటు చేస్తుందని వివరించారు. మహిళలకు ప్రత్యేకంగా ఏకాదశి దిన దీక్ష(11 రోజులకు) అనగా, 14వ తేదీన దీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు.

రెండో రోజు క్రీడా జోరు

- ముగిసిన కోనసీమ క్రీడోత్సవాలు
- బహుమతులు అందజేసిన కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి, అమలాపురం: 'కోనసీమ క్రీడోత్సవాలు.. ఆటలతో ఆరోగ్యం' పేరుతో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల క్రీడల్లో విద్యార్థులు సత్తాచాటారు. క్రీడల్లో గెలుపే లక్ష్యంగా చెలరేగి ఆడారు. బాలురు, బాలికలు అనే తేడా లేకుండా తమ జట్టు గెలుపు లక్ష్యంతో ప్రతి క్రీడాకారుడు తలపడడంతో పోటీలు హోరాహోరీగా సాగాయి. బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక బాలయోగి స్టేడియంలో రెండవ రోజు గురువారం పోటీలు ముగిశాయి.

బాస్కెట్‌బాల్ విజేత రామచంద్రపురం

బాస్కెట్‌బాల్ బాలుర, బాలికల విభాగంలో రామచంద్రపురం సత్తాచాటింది. ఈ రెండు విభాగాల్లోనూ ఎస్‌కేపీజీఎల్ స్కూల్ రామచంద్రపురం విజేతగా నిలిచింది. బాలుర ద్వితీయ స్థానంలో అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల విభాగంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలు నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్‌లో అమలాపురం మున్సిపల్ హైస్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల రాజోలు నిలిచాయి. కబడ్డీ బాలుర విభాగంలో మామిడికుదురు, భైరవపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలు, బాలిక విభాగంలో మోరి, బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో బీసీ వెల్ఫేర్ స్కూల్ సమనస, భట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల తొండవరం, భైరవపాలెం విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ బాలుర విభాగంలో ద్వారపూడి, సరిపల్లి, బాలికల విభాగంలో గొల్లవిల్లి, ఈతకోట జెడ్పీ హైస్కూల్ విజేతగా నిలిచాయి.

అథ్లెటిక్స్‌లో...

400 మీటర్ల పరుగు పందెంలో కె.మోహన్ (బట్టేలంక), పి.సత్యనారాయణ (సమనస), కె.మనోజ్ (పుల్లేటికుర్రు), వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కె.వేణుమానస్, పి.రాకేష్, ఎస్.సంతోష్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు.

గుర్తుండిపోయే క్రీడా ఉత్సాహం: కలెక్టర్

జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో 7,8,9 తరగతుల చదువుతున్న విద్యార్థులకు కోనసీమ క్రీడోత్సవాలు మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సమన్వయంతో పోటీలు విజయవంతమయ్యాయని తెలిపారు. జేసీ టి.నిషాంతి, ఆర్డీవో బి.మాధవి, డి.అఖిల, డీఈవో షేక్ సలీం బాషా, జిల్లా చీఫ్ కోచ్ సురేష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అడబాల శ్రీనివాస్, పీఈటీలు ఉండ్రు ముసలయ్య, బి.ఎస్.ఎన్.మూర్తి, గణపతి రామారావు, కామన గణేష్ పాల్గొన్నారు.



సర్వీసే షాట్ కొడుతున్నట్టుగా...: వాలీబాల్‌లో సర్వీస్ చేస్తున్న బాలిక

గురి చూస్తే గోల్ పడాల్సిందే: బాస్కెట్‌బాల్‌లో గోల్‌కు సిద్ధమవుతూ...



బాలికల అథ్లెటిక్స్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి, డీఈవో సలీంబాషా తదితరులు



పరుగులు తీస్తూ... : పరుగు పందెంలో తలపడుతున్న బాలికలు

సెల్ఫ్ అసెస్‌మెంట్‌కు వేళాయె

- ఈ నెల 27 నుంచి ఎస్ఏ-3 పరీక్షలు
- 1-8 తరగతులకు సీబీఏ-2, 9, 10 క్లాసులకు పాత విధానం
- 1-8 తరగతులకు బైలింగ్విల్‌లో ప్రశ్నపత్రం
- జిల్లాలో 1.07 లక్షల మంది విద్యార్థులు



రాయవరం: విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహిస్తోంది. ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా ఎఫ్ఏ-3 పరీక్షలను ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ 2,036 పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు 2022 నవంబర్ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలను ప్రయోగాత్మక విధానంలో 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్' విధానంలో ప్రారంభించారు. ఎఫ్ఎ-2 పాత విధానంలో నిర్వహించగా, ఎఫ్ఏ-3 తిరిగి సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది.

ఉత్తమ ప్రమాణాల పెంపునకు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటుగా, పక్కా బోధనతో వారిలో సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడం, ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఈ విధానం దోహదపడనుంది. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ 1, 3, ఎస్ఏ-2 సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. ఎస్ఏ1 పాత విధానంలో నిర్వహిస్తుండగా, సెల్ఫ్ అసెస్మెంట్ 2, 4 ఎస్ఏ1 పాత విధానంలోనే నిర్వహిస్తారు. 9,10 తరగతులకు నాలుగు సెల్ఫ్ అసెస్మెంట్స్, రెండు ఎస్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

బైలింగ్విల్ ప్రశ్నపత్రాలు

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రం పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. ప్రశ్నలు ఎంయూఏ విధానంలో ఇస్తారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ టైపులో ఇస్తారు. 15 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, ఐదు మార్కులకు రాత పూర్వక జవాబు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నలన్నీ విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్..అండర్ స్టాండింగ్..అప్లికేషన్(ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.

ఈ నెల 27-31 వరకు పరీక్షలు

సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2,02,532 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,08,733 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 93,799 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, వీరంతా ఎఫ్ఏ-3 పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు సాధారణ విధానంలోనే పరీక్షలు రాస్తారు. వీరికి సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించరు.

మండల కేంద్రాలకు పంపిణీ పూర్తి



పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపిణీ పూర్తి చేశాం. పరీక్ష పేపర్లకు ఎంఈవోలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– బి.హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, అమలాపురం

పకడ్బందీగా నిర్వహించాలి

పరీక్షలను ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలి. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంపై ఉపాధ్యాయులకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన ఉంది. గతంలో నిర్వహించిన సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల మాదిరిగానే సీబీఏ పరీక్షలను కూడా నిర్వహిస్తాం. అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ షేక్ సలీంబాషా, డీఈవో, అమలాపురం


మండపేట మండలం కేశవరం వద్ద రైల్వే గేటు వేసి ఉండగా చంటిబిడ్డతో గేటు దాటుతున్న మహిళ


సామర్లకోట స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ కోసం పట్టాలు దాటుతున్న ప్రయాణికులు


తుని రైల్వే స్టేషన్‌లో ఇలా..


నిడదవోలు రైల్వేస్టేషన్‌లో ఆదరాబాదరాగా..


రాజమహేంద్రవరంలో...

ప్రమాదంతో చెట్టాపట్టాలు!

మహారాష్ట్రలో బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో 12 మంది పట్టాలపై ప్రాణాలు కోల్పోయినా జనం ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించడం లేదు. తోటివారికన్నా ముందుండాలని, సమయం కలిసొస్తుందని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించకుండా పట్టాలను దాటేస్తున్నారు. రైల్వే అధికారులు చేసే హెచ్చరికలను, ఇచ్చే సూచనలను పెడచెవిన పెట్టి అయినవారిని దుఃఖసాగరంలో ముంచే ఈ కంగారు అవసరమా అన్నది అందరూ ఆలోచించాల్సిన విషయం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గురువారం వివిధ స్టేషన్లలో ప్రయాణికులు ప్రాణాలు పణంగా పెట్టి ఇలా పట్టాలు దాటారు.

జోరుగా గొలుసుకొట్టు చోరీలు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చైన్ స్నాచింగ్‌లు
- నగలు ధరించి బయటకు వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న నేరస్తులు
- అదుపులో నలుగురు అనుమానితులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో దొంగలు మరోసారి పేట్రేగిపోయారు. బుధవారం ఒక్కరోజే ఆరుచోట్ల చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోవడంతో మహిళలు బంగారు నగలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గత ఏడాది చైన్ స్నాచింగ్ 22 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఒక్క నెలలోనే 7 కేసులు నమోదు కావడం గమనార్హం.

పుస్తెల తాళ్లు పక్కన పెడుతున్నారు

మహిళలు బంగారు నగలు ధరించడం హోదాగా భావిస్తారు. ఆలయాలకు, ఫంక్షన్లకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా నగలు ధరిస్తారు. అయితే జరుగుతున్న వరుస దొంగతనాలతో బంగారు నగలు ధరించడానికి భయపడుతున్నారు. బంగారు పుస్తెలతాడులు సైతం పక్కన పెట్టి పసుపు తాడుతో బయటకు వస్తున్నారు. జిల్లాలో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాల్లోను ఇదే విధంగా తరచుగా దొంగతనాలు జరుగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారింది.

పాత వారా.. కొత్త వారా?

జరుగుతున్న దొంగతనాలతో ఉమ్మడి జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైనా ఫలితం లేదు. నేరస్తులు హెల్మెట్ ధరించి ఈ చోరీలు చేస్తుండడం, పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటుండడంతో పాటు నేరం చేసిన వెంటనే క్షణాల్లో తప్పించుకుని వెళ్లిపోతున్నారంటే జిల్లాలోని వీధులు, రహదారులపై పూర్తి అవగాహన ఉండి ఉండాలి. జిల్లాలో నేరస్తులే ఈ చోరీలు చేస్తుండవచ్చని ఒక భావన. మరో పక్క అమలాపురం, కాకినాడ జిల్లాల్లోనూ ఇదే తరహా చోరీలు జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లాపై పూర్తి పట్టు ఉన్న వేరే ముఠా ఏదైనా ఈ నేరాలకు పాల్పడుతోందా అని పోలీసులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.



పాత నేరస్తులపై పూర్తి నిఘా

ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డ నేరస్తుల చిట్టాను ఇప్పటికే పోలీసులు బయటకు తీశారు. వారికి ఈ నేరాలతో ఏమైనా సంబంధం ఉందా, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, వారు ఏ ఫోన్ వాడుతున్నారు, నేరం జరిగిన సమయంలో ఆ ఫోన్ ఎక్కడ పనిచేస్తోంది తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నేరస్తులను త్వరగా పట్టుకోవాలి

గతంలో విజిబుల్ పోలీసింగ్ ఎక్కువగా ఉండేది. ఇటీవల కాలంలో అది తగ్గింది. ఇటీవల నగరానికి వచ్చిన డీజీపీ కూడా విజిబుల్ పోలీసింగ్ అవసరం లేదని, కేసుల పురోగతి, దర్యాప్తు విజిబుల్‌గా ఉండాలని అనడం గమనార్హం. ఈ విధానం సరైన విధానం కాదని ప్రజలు అనుకుంటున్నారు. రోడ్డు పైకి వచ్చినప్పుడు ఏదో మూల పోలీసు, పోలీసు వాహనం కనపడితే నేరం చేయడానికి వచ్చే నేరస్తుడు భయపడి ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటాడు. విజిబుల్ పోలీసింగ్‌లో ఉన్న ఉపయోగం అది. మళ్లీ దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. జరిగిన గొలుసు దొంగతనాలపై దర్యాప్తు ముమ్మరం చేసి నేరస్తులను త్వరితగతిన పట్టుకోవాలి. ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేరస్తులను పట్టుకుంటాం



గొలుసు చోరీలపై నిఘా పెట్టాం. జరుగుతున్న నేరాలు ఇక్కడి వారి పనా, వేరే రాష్ట్రం ముఠా చేసిందా అనేది దర్యాప్తులో తేలాల్సి వుంది. చోరీలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశాం. విజిబుల్ పోలీసింగ్ పెంచుతున్నాం. ఆలయాల వద్ద, ఫంక్షన్ హాళ్ల వద్ద మఫ్టీలో గస్తీని పెంచుతాం. మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయాల్లో మహిళలు 112 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందాలి. నేరం జరిగిన తర్వాత గగ్గోలు పెట్టడం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకుంటే నేరానికి ఆస్కారం ఉండదు.

–డి.నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

పోలీసుల అదుపులో చైన్ స్నాచింగ్ అనుమానితులు?

వరుస చైన్ స్నాచింగ్ చోరీల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం మరోసారి వరుస చోరీలు జరగడంతో బృందాలు అప్రమత్తమై నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాయి. చోరీలతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ముఠా రంపచోడవరం, సీలేరు మీదుగా ఒడిశా బోర్డర్‌లోకి ప్రవేశించినట్టు గుర్తించారు. నలుగురు అనుమానితులను బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బాధితురాలికి ఊరట

స్పందించిన అధికారులు

నల్లజర్ల: అనంతపల్లిలో మూడు రోజులుగా గృహ నిర్బంధంలో ఉన్న మామిడి రూత్‌లక్ష్మికి ఊరట లభించింది. వృద్ధురాలు పడుతున్న ఇబ్బందులను వెల్లడిస్తూ 'ఇంటి నుంచి బయటకు వచ్చే దారేది' అంటూ 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన వార్తా కథనానికి కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత స్పందించారు. తక్షణం అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎస్.వి.నాయుడును ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ వై.రాధాబాయి, వీఆర్వో సురేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కనకదుర్గ, సుస్మిత ప్రియాంక బాధిత వృద్ధురాలు రూత్‌లక్ష్మిని కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎదురింటి యజమాని పాటంశెట్టి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతోను అధికారులు మాట్లాడారు. వ్యవహారం కోర్టులో ఉన్నా, తీర్పు వచ్చే వరకు ఇంతవరకు ఏవిధంగా దారి వినియోగించారో అదే విధంగా కొనసాగించాలని సూచించారు. ఇంటి గుమ్మం ముందు ముళ్లకంపలు వేసిన మిగతా ఇళ్లవారి వద్ద వివరాలు సేకరించారు. వృద్ధురాలిని ఇబ్బందులకు గురి చేయవద్దని ఆదేశించారు. ఆర్డీఓ ఉత్తర్వులను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సాక్షి ఇంపాక్ట్


అనంతపల్లిలో గృహ నిర్బంధంలో ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లిన అధికారులు

యువతి కిడ్నాప్‌పై కేసు నమోదు

అయినవిల్లి: ఓ యువతి కిడ్నాప్‌పై గురువారం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ ఆర్. శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం సిరిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతిని అనకాపల్లి వద్ద నక్కపల్లికి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు పుడి సాయి బుధవారం రాత్రి కిడ్నాప్ చేశాడు. పుడి సాయి కొంత కాలంగా అయినవిల్లి మండల పరిధిలో గ్రామాల్లో కొబ్బరి దింపు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. యువతి తండ్రి బాషా ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి


నాగూర్ (ఫైల్)

అంబాజీపేట: స్థానిక అమెరికన్ ఆస్పత్రి సమీపంలో ఉన్న డొమ్మేటివారిపాలేనికి చెందిన శతాధిక వృద్ధుడు పితాని నాగూర్ (103) గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కుమారుడు మండల తాపీ పనివార్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును పలువురు పరామర్శించారు. నాగూర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

మారిన రైళ్ల వేళలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల సమయాలను మారుస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ రైల్వే డివిజన్‌లో విజయవాడ తర్వాత రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌గా కొనసాగుతోంది. నిత్యం జిల్లా మీదుగా 110 రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా సుమారు 50 వేల మంది ప్రయాణిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరంతోపాటు సామర్లకోట, కాకినాడ, తుని తదితర రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అయితే తాజాగా రైళ్ల సమయం మార్పు జరగడంతో మారిన రైళ్ల రాకపోకల సమయాలను ప్రయాణికులు గుర్తించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మారిన సమయాలు ఇలా

రైలు నంబరు	రాజమహేంద్రవరం		సామర్లకోట	
	పాత టైమ్	మారిన టైమ్	పాత టైమ్	మారిన టైమ్
22834 భువనేశ్వర్	06.45	06.20	05.25	04.45
13352 అలెప్పీ ధనబాద్	08.20	07.35	09.15	08.25
12718 రత్నాచల్	08.35	07.58	09.15	08.50
17249 తిరుపతి- కాకినాడ	09.50	08.40	10.45	09.30
12515 సిల్చార్ ఎక్స్‌ప్రెస్	15.45	15.10	----	-----
22643 పాట్నా	15.45	15.10	----	-----
12509 గౌహతి	15.45	15.10	----	-----
12842 కోరమండల్	16.10	15.30	17.50	17.05
22842 శంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్	17.05	16.25	17.50	17.05
22808 శంత్రాగచ్చి ఏసీ	17.05	16.25	17.50	17.05
12659 గురుదేవ్	18.00	17.25	18.50	18.05
17482 తిరుపతి-బిలాస్‌పూర్	22.25	21.40	23.10	22.20
17480 తిరుపతి- పూరి	22.25	21.40	23.10	22.20
12845 భువనేశ్వర్	17.20	16.40	16.30	16.00
18047 వాస్కో	15.35	16.05	-----	-----
17488 తిరుమల	17.40	17.05	01.05	12.30
17220 విశాఖ-మచిలీపట్నం	02.00	01.10	01.05	12.30
12755 భావనగర్	06.40	06.35	-----	(హాల్ట్ లేదు)
17206 షిర్డీ ఎక్స్‌ప్రెస్	07.15	06.05	06.25	05.30
12737 గౌతమీ	20.20	20.20	19.40	19.40
12775 కోకనాడ	21.00	21.00	-----	(హాల్ట్ లేదు)

ఆదిత్య విద్యార్థుల వినూత్న ప్రయత్నం


జేఎన్‌టీయూకేలో ఆదిత్య నిర్వహించిన హ్యాండ్‌రైటింగ్ మారథాన్


హ్యాండ్‌రైటింగ్ మారథాన్‌లో పాల్గొన్న జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించడానికి కాకినాడ ఆదిత్య విద్యార్థులు వినూత్న ప్రయత్నం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, జాతీయ చేతి రాత దినోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకేలో గురువారం దాదాపు 2,200 మంది విద్యార్థులతో హ్యాండ్ రైటింగ్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య గ్రూప్ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్ర ఆదిత్య విద్యార్థులతో కలిసి రాయడమనేది చాలా గొప్పవిషయమన్నారు. ఆరేళ్లుగా తమ విద్యార్థులు హ్యాండ్‌రైటింగ్ శిక్షణ పొందుతూ నైపుణ్యాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ నైపుణ్యంతో ఈసారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో చోటు పొందేందుకు వినూత్న ప్రయత్నం చేశారన్నారు. జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తమ వర్సిటీ వేదిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు. మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, స్కూల్ డైరెక్టర్ శృతిరెడ్డి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీదిలీప్‌పాత్రో, సద్గురు అకాడమి చైర్మన్ మహాలక్ష్మి, సింగర్ కొండేపూడి యశస్వి పాల్గొన్నారు.

'సూర్యఘర్' అమలుతో అరుదైన అవకాశం

యానాం: స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్న దంపతులు కామాడి గంగరాజు, నీలిమలకు సూర్యఘర్ పథకం అమలుతో ఈ నెల 26న న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలను వీక్షించే అవకాశం దక్కింది. వివరాలలోకి వెళితే మెట్టకూరు గ్రామంలో యానాం విద్యుత్‌శాఖ ప్రోత్సాహంతో 'అంప్లసోన్' అనే సంస్థ సహకారంతో రూ.2లక్షల 25వేలు(ఇందులో రూ.78వేలు సబ్సిడీ) పెట్టుబడితో 'పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన స్కీం ద్వారా 3 కెడబ్ల్యు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మిగులు విద్యుత్‌ను యానాం గ్రిడ్‌కు పంపిణీ చేస్తున్నారు. 'మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ' అధికారులు పథకాన్ని పరిశీలించి గంగరాజు దంపతులను రిపబ్లిక్‌డే పరేడ్ వేడుకలకు ఎంపిక చేశారు. వారికి ప్రయాణ, వసతి ఏర్పాట్లను పుదుచ్చేరి, యానాం విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది.


సోలార్ ప్లాంట్ వద్ద గంగరాజు, నీలిమ దంపతులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దాడి చేసిన ముగ్గురు యువకుల అరెస్ట్

అమలాపురం టౌన్: తప్పుకోమని మోటారు సైకిల్ హారన్ కొట్టిన కారణానికి ఒక యువకుడిపై అమానుషంగా దాడి చేసి గాయపరచడమే కాకుండా మోటర్ సైకిల్‌ను ధ్వంసం చేసిన ముగ్గురి యువకులను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. స్థానిక ఈదరపల్లి వంతెన సమీపంలో నవరప్పాలేనికి చెందిన దుర్గాప్రసాద్‌ను పరమట ఆనందరావు, పరమట సురేష్, బొర్లి వీర వెంకట సత్యనారాయణ దాడి చేసి గాయపర్చిన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ చెప్పారు. నిందితులను కొత్తపేట సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

బిందుశ్రీకి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు


బిందుశ్రీ

యానాం: 69వ జూనియర్ జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ క్రీడా పోటీల్లో టీమ్ విభాగంలో ద్వితీయ, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును నీలపల్లికి చెందిన ఇసుకపట్ల బిందుశ్రీ అందుకున్నారు. ఈ మేరకు గురువారం తూర్పుగోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పనస్వామి, తాళ్లరేవు మండల బాల్‌బ్యాడ్మింటన్ అసోయేషన్ అధ్యక్షుడు ఇసుకపట్ల అంబేడ్కర్ ప్రకటనలో తెలిపారు. శాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర నాగపూర్ జిల్లాలో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు పోటీలు సాగాయి.